# ఆడదే అలిగిననాడు



సాయంత్రం అయిదున్నర దాటింది. ఎండ తీవ్రత తగ్గు ముఖం పట్టింది.

అపడే స్నానం చేసి బట్టలు మార్చుకుని, నిలువుటద్దం ముందు కూచుని జడ అల్లుకుని, మల్లె చెండును తల్లో తురుముకుంటోంది అమల.

తలుపు తట్టిన శబ్దం అయ్యింది.

జారిపోతులా వున్న జడని సుతారంగా ముందుకు వేసుకుని సరిచేసుకుంటూ తలుపు తెరిచింది అమల.

ఎదురుగా భర్త నరేంద్ర. అతనితో పాటు కాస్తంత వయసు మళ్ళిన ఓ వ్యక్తి హుందాగా నిల్చున్నాడు. రోల్డుగోల్డు ఫ్రేము కళ్ళద్దాలు, అతని హోదాని, అంతస్తుని చెప్పక చెబుతున్నాయి.

అమల లోపలికి నడిచింది.

''రండి సార్'' అన్నాడు నరేంద్ర. లోపలికి వస్తూ.

అతనితో వచ్చిన వ్యక్తి కళ్ళద్దాలు ఓసారి సర్దుకుని హుందాగా నడుస్తూ లోపలికొచ్చాడు. అతని పేరు నరసింహం. అతని చేతిలో ఓ పేకెట్టుంది.

''కూచోండి సార్'' నరేంద్ర అభ్యర్థన.

నరసింహం సోఫాలో కూచున్నాడు. చుట్టూ ఓసారి కలయజూశాడు. గది నీటుగా వుంది.

''అమలా, యిలారా'' పిల్చాడు నరేంద్ర.

అమల భుజమ్మీంచి చీర చెంగు కప్పుకుంటూ మంద గమనంతో వచ్చింది.

''వీరు మా బాస్ నరసింహంగారు'' అంటూ పరిచయం చేశాడు నరేంద్ర.

''నమస్కారమండీ'' సవినయంగా అంది అమల.

ఆమె కంఠంలో లాలిత్యం వుట్టి పడింది. అందానికి తగ్గట్టు కంఠమూ లలితంగానే వుందనుకున్నాడు నరసింహం.

''నమస్కారం... కూచోండిలా'' తన ప్రక్కనే చోటు చూపిస్తూ అన్నాడు నరసింహం

కాని అమల కూచోలేదు.

''ఫరవాలేదు లెండి'' అంది.

నరేంద్ర గుటకలు మింగాడు.

''అమలా వీరి చేతిలోనే నా భవిష్యత్తుంది. వీరు తల్చుకుంటే నాకు ప్రమోషను దొరుకుతుంది. కనక వర్షాన్ని కుమ్మరించే సీటు దొరుకుతుంది. నేనంటే వీరికి ప్రత్యేకమైన అభిమానం వుంది. లేకపోతే వీరు మనింటికి రావడమేమిటి?

మన వివాహానికి రాలేకపోయినందుకు వూరికే బాధపడుతూ ఈ రోజు ఇలా వచ్చారు. వారిని గౌరవించడం మన ధర్మం అలా కూచో ఫరవాలేదు'' అన్నాడు నరేంద్ర.

భర్త ఆజ్ఞ శిరసావహించక తప్పలేదు. భార్యామణికి ముళ్ళకంప మీద కూచున్నట్టే నరసింహంకి యెడంగా సోఫాకి ఓ చివర్న ఒదిగి కూచుంది అమల. పరాయి వ్యక్తి పక్కన ఒకే సోఫాలో కూచోవడం యెంతో ఇబ్బందిగా ఫీలవుతున్నా భర్త మాటని కొట్టి పారేయలేక పోయింది. అయితే భర్త ఆజ్ఞని హర్షించలేక పోయింది.

''మీ పేరు యేమిటన్నారూ?'' అమల మొహంలోకి చూస్తూ ప్రశ్నించాడు నరసింహం.

''అమల సార్'' చప్పున చెప్పాడు నరేంద్ర.

''నువ్వుండవయ్యా. ఆమె మృదు మధుర కంఠంతో చెప్పనీ! ఆమె చెబితే ముత్యాలు రాలిపోతాయా'' నరేంద్ర కేసి సీరియస్‌గా చూస్తూ అన్నాడు నరసింహం.

నరేంద్ర మొహం వాడిపోయింది.

''అబ్బే అదేం లేదుసార్! అమలా! నీ పేరు నువ్వే చెప్పు'' అన్నాడు.

భర్త ప్రవర్తన కాస్తంత జుగుప్స కలిగించింది అమలకి. అతను ఎంత బాస్ అయితే మాత్రం నరేంద్ర యింతగా దిగజారి పోవాలా? అనుకుంది లోలోన.

''అమల'' అంది ముక్తసరిగా.

నరసింహం మొహంలో కొత్త కాంతి పుంజుకుంద. ఓసారి కళ్ళద్దాలు సవరించుకుని ఆమెకి కాస్తంత దగ్గరగా జరిగాడు.

''అబ్బ ఎంత చక్కని పేరండీ పేరు కంటె మృదు మధురమైన మీ పలుకులు సంపంగి పూవులాంటి మీ నాసిక యెవరినైనా ఇట్టే ఆకర్షిస్తాయి సుమండీ'' అన్నాడు మందహాసంతో.

అమల కళ్ళల్లో యెర్రని జీరలు ఏర్పడ్డాయి.



ముద్దంశెట్టి హనుమంతరావు

భర్తకేసి య్రెరగా చూసింది. స్త్రరున లేచి నిల్చుండి పోయింది.

"ఏవిటండీ! మీ బాస్ కవిత్వం వల్లిస్తున్నారేంటి" అంది కోపంగా.

నరేంద్ర కంగారు పడ్డాడు. చప్పున లేచి భార్య దగ్గరికి వచ్చాడు.

"కోపగించుకోకు అమలా! నీ అందం యెవర్నయినా పిచ్చెక్కిస్తుంది" అన్నాడు మెల్లగా.

"ఆ... ఆ... కరెక్టండీ. మీ అందం మహత్యం అదండీ అమలగారూ ఒక్కసారి మిమ్మల్ని చూసిన వాళ్ళు జీవితాంతం మీ అందాన్ని మర్చిపోలేరు" అంటూ తనని తాను సమర్థించుకున్నాడు నరసింహం.

అమల తీక్షణంగా చూస్తూ యేదో అనబోతూ వుంటే నరేంద్ర కలిగించుకున్నాడు.

"అమలా మన పెళ్ళి పార్టీకి మా బాస్ రాలేక పోయారు. అంచేత నీ కోసం యేదో ప్రెజెంటేషన్ తీసుకొచ్చారు. ఇచ్చేయండి సార్" అంటూ టాపిక్ మార్చేశాడు.

"ఔనవును. మీ కోసం ఈ ప్రెజెంటేషన్ తెచ్చానండీ అమలగారూ" అంటూ తాను తెచ్చిన పేకెట్టును ఆమెకి అందించాడు నరసింహం.

అమల ఆ పేకెట్టుని పక్కనే వున్న బల్ల మీద పెట్టింది. ఆమె వక్షోజాలు కోపంతో వూగిసలాడుతున్నాయి. నాసికా రంధ్రాల్నించి వూపిరి బుసలు కొడుతోంది. ఆ కోపంలో కూడా అమల యెంతో అందంగా అగుపించిందతనికి. అప్పటికి ఆమెనింకా రెచ్చగొట్టడం మంచిది కాదనిపించిందతనికి.

"నరేంద్ర మరి నేను వెళ్ళొస్తానోయ్" అంటూ లేవబోయాడు నరసింహం.

భార్య కోపాన్ని గమనించిన నరేంద్ర కాస్తంత తికమక పడ్డాడు. అయినా అతని భవిష్యత్తు అతని ధ్యేయంలోంచి తప్పుకోలేదు.

"కూచోండి సార్! మా యింటికొచ్చి యేమీ తీసుకోకుండా వెళ్ళిపోవడం మాకే చిన్నతనం. ఒక విధంగా అవమానం కూడాను. అసలు మా ఆవిడ అలా వెళ్ళనివ్వదు. కదూ అమలా?" అన్నాడు నరేంద్ర.

అమల మౌనం వహించలేక పోయింది.

"ఔనండీ! ఆతిథ్యం స్వీకరించకుండా యెలా వెడతారు? కూచోండి... ఫలహారం, కాఫీ తీసుకొస్తాను" అంటూ లోపలికి వెళ్ళి ఓ ప్లేట్ బిస్కెట్లు, స్వీట్లు తెచ్చి పెట్టింది.

"ఇప్పుడివన్నీ యెందుకండీ అమలగారూ?" అంటూనే ఓ బిస్కెట్ తీసి తినడం ప్రారంభించాడు నరసింహం.

"కాఫీ తెస్తానుండండి" మళ్ళీ వెళ్ళింది అమల.

"అలా వెళ్తోన్న అమల కేసి చూస్తో, బిస్కెట్ తినటమే మర్చిపోయాడు నరసింహం.

"అలా చూస్తున్నారేంటి? తినండి సార్" అన్నాడు నరేంద్ర.

ఊహాలోకంలోంచి యీ లోకంలోకి వచ్చి పడినట్టుగా ఒకింత తృళ్ళిపడి బిస్కెట్ తినడం ప్రారంభించాడు నరసింహం.

"నువ్వు చాలా అదృష్టవంతుడివోయ్ నరేంద్రా" అన్నాడు నరసింహం.

"ఎందుకు సార్"

"ఇంత అందమైన భార్య లభించినందుకు"

"ఆ! ఏం అదృష్టం లెద్దురూ! ఈ నాటి సమాజంలో హోదా, ఐశ్వర్యం వుంటేనే అదృష్టం వున్నట్టు" నిరుత్సాహంగా అన్నాడు నరేంద్ర.

నరసింహం మెల్లగా నవ్వేడు. నరేంద్రలోని బలహీనతను యెప్పుడో కనిపెట్టేశాడతను.

"అవీ క్రమంగా వచ్చేస్తాయి లేవోయ్. నేను మాటిచ్చానూ అంటే అదెప్పుడూ పొల్లుపోదు"

"మీ దయ"

అమల రెండు కప్పులతో కాఫీ తీసుకొని ఒకటి భర్తకి, మరోటి అతని బాస్‌కి అందించింది.

"మీకు షుగర్ ప్రెషర్ ఏవీ లేవు కదా అంకుల్?" అంది నరసింహంకి కాఫీ అందిస్తున్నప్పుడు.

నరసింహం మనస్సు చివుక్కుమంది. ఆముదం తాగుతున్నట్టుగా మొహం పెట్టాడు.

"అబ్బే! నాకా రోగాలేం లేవుగాని మీరలా సంబోధించకూడదండీ అమలగారూ. అసలు నాకేం పెద్దవయస్సని?" అన్నాడు.

"ఓ! అలాగా! మిమ్మల్ని చూసి అలా అనుకున్నానండి... కాఫీ తీసుకోండి"

నరసింహం కాఫీ తీసుకుని లేచాడు.

"వెళ్ళొస్తానండీ అమలగారూ! మీరిచ్చిన మధురమైన టిఫిను కాఫీకి థాంక్స్"

"మంచిదండీ"

"సార్! అప్పుడప్పుడూ మీరొస్తూ వుండండి" అన్నాడు నరేంద్ర.

అమల మొహం య్రెర బారింది. భర్త యెంతగా దిగజారి పోతున్నాడో మరోసారి అర్థం చేసుకుంది. భర్తల్లో ఇటువంటి వెధవలు (పాపం శమించుగాక) కూడా వుంటారా... అనుకుంది.

ఓ. ష్యూర్ ... ష్యూర్... రమ్మంటుంటే రాకుండా వుంటానా" అంటూ అమలకేసి చూస్తూ పెదాలు తడుపుకుంటూ ఆమె కోపాన్ని గమనించి చప్పన వెనక్కి తిరిగి బైటికి నడిచాడు నరసింహం.

అమల సోఫాలో కూలబడింది కోపంతో

బైట స్కూటర్ స్టార్ట్ అయిన శబ్దం వినిపించిందామెకి.

నరేంద్ర లోపలికొచ్చాడు.

"ఇట్లాంటి పోకిరీ వెధవని యెందుకు తీసుకొచ్చారండీ మనింటికి?" చిందులు తొక్కుతూ కళ్ళెర్ర జేస్తూ అంది అమల.

నరేంద్ర భార్యని బుజ్జగిస్తున్నట్టుగా ఆమె చుబుకాన్ని పట్టుకున్నాడు.

"ఆవేశం తెచ్చుకోకు అమలా మైడార్లింగ్! పరిస్థితిని ఆకళింపు చేసుకో. వీడే నా భవిష్యత్‌కి బ్రహ్మలాంటివాడు. వాడితో మన పరిచయం మనకే లాభదాయకం. మనకి డబ్బు కావాలన్నా, హోదా కావలన్నా వీణ్ణి మన గుప్పెట్లో పెట్టుకోవాలి. తప్పదు. నువ్వు నా భార్యవే కాదు... నా భాగ్యరేఖవి" అంటూ లాలించబోయాడు నరేంద్ర.

అమల భర్త చేతుల్ని విసిరి కొట్టింది.

"అంటే యేవిటండీ మీ వుద్దేశం? ఆ వెధవ

తో నేను తిరగాలా?'' వుద్రేకంగా అంది అమల. ఆమె కళ్ళు నిప్పుల్ని కక్కుతున్నాయ్.

''అది కాదు నా అభిప్రాయం అమలా? కేవలం నటన మన అవసరం తీరే వరకూ నటన అంతే'' అన్నాడు ప్రాధేయపడుతున్నట్టు.

అమల కాస్త చల్ల బడింది.

''కొంత నయం. ఆపాటి ఆలోచించారు. మీకు నిజంగా డబ్బు పిచ్చి పట్టుకుందండీ. ఆ పిచ్చి యెలా వదల గొట్టడమో నాకు తెలుసు'' కోపంగా అంటూ అక్కణ్ణించి విసురుగా వెళ్ళిపోయింది వంటగది కేసి.

నరేంద్ర తృప్తిగా నవ్వుకున్నాడు.

ఆడవాళ్ళ విషయంలో, కాస్తంత అవకాశం చిక్కిందంటే, యే మగాడూ వూరుకోడు... ముందుకు పోవాలనే ప్రయత్నిస్తాడు.

యౌవనంతో పిటపిటలాడుతోన్న అమల అందాల్ని జుర్రుకోవాలన్న ఆశ, ఆరాటం, నరసింహాన్ని నిద్రపట్టనివ్వడం లేదు. అమల భర్త నరేంద్ర బలహీనత అతనికి వల్లమాలిన ధైర్యాన్నిచ్చింది.

* * *

ఓ రోజు లంచ్ టైమ్‌లో నరేంద్రని తన రూమ్‌లోకి పిలిపించాడు, నరసింహం.

''పిల్చారా సార్?'' అన్నాడు, నరేంద్ర.

''ఔనోయ్... ఇదిగో యీ స్టేట్‌మెంటు తయారుచేసి నాలుగ్గంటలకంత నా కివ్వు. దీని మీదే నీ ప్రమోషను ఆధారపడుంటుంది...'' అంటూ కొన్ని కాగితాలు అతని కందించాడు నరసింహం.

నిజానికి, ఆ పని నరేంద్రది కాదు. అయినా, తన ప్రమోషనుతో ముడిపడి వుందనడం వల్ల, కాదనలేకపోయాడు. ''అలాగే సార్...'' అంటూ ఆ కాగితాలు తీసుకుని బైటికి నిష్క్రమించాడు, నరేంద్ర.

నరసింహం బైటికొచ్చి స్కూటర్ తీశాడు. స్కూటర్ని నేరుగా నరేంద్ర యింటికి పోనిచ్చాడు.

స్కూటరాగిన చప్పుడు విన్న అమలకి హృదయస్పందన అధికమయింది. భర్త బాసే వచ్చివుంటాడన్న నిర్ధారణకి వచ్చేసింది. ఆమెకి తెలుసు, యెప్పుడో ఒకప్పుడు నరసింహం వస్తాడని. దూరంలో అగుపించిన లేడిని పులి విడిచిపెడుతుందా? అయితే, లేడి అందకుండా తెలివిగా తప్పించుకుంటే, గొడవే వుండదనుకుంది. ధైర్యాన్ని కూడదీసుకుంది.

తలుపు తట్టాడు నరసింహం.

''ఎవరూ?'' ప్రశ్నించింది, అమల.

''నేనండీ..'' మెల్లగా సమాధానం చెప్పాడు, నరసింహం.

''అంటే...'' తెలిసి కూడా అడిగింది.

''మీ ఆయన 'బాస్'ని'' మెల్లగానే అన్నాడు.

అమల తలుపు తెరిచింది.

''ఆయన యింట్లో లేరండీ.''

''నాకు తెలుసునండీ! నరేంద్ర ఆఫీసులో బిజీగా వున్నాడు.''

''అలాగా!'' అని అమల అంటుండగానే లోపలికి నడిచాడు, నరసింహం.

''తలుపు వేసెయ్యండి..'' అన్నాడతను.

కాని, అమల తలుపు గడియ పెట్టకుండా, దగ్గరగా వేసింది. ఆమెలో ధైర్యం బాగా పుంజుకున్నట్టుంది. ఏ మాత్రం బెదురు అగుపించడం లేదు.

నరసింహం సోఫాలో కూలబడ్డాడు.

''ఇదిగోండి అమలగారూ, మల్లెపూలు తెచ్చాను..'' తాను తెచ్చిన పూల పొట్లాం అందించాడు.

''ఒక్క క్షణం వుండండి. మల్లెపూలు పెట్టుకుని వస్తాను..'' అంటూ బెడ్‌రూమ్ కేసి నడిచింది, అమల.

వాతావరణం అనుకూలంగా వున్నందుకు, మురిసిపోతున్నాడు నరసింహం.

అమల, క్షణంలో తిరిగొచ్చింది.

''కూచోండి డియర్..'' అన్నాడు, సోఫాలో తన పక్కనే చోటు చూపిస్తూ.

అమలకి వొళ్ళు మండిపోతోంది. కాని, బైట పడ్డంలేదు. ''దొంగచాటుగా నాతో సరసాలు జరపడానికొచ్చి, యింకా ఆ గౌరవ సూచకమైన సంబోధన లెందుకండీ..'' అంది.

''ఔను. అదీ నిజవే డియర్.. కూచో.. నీ అందానికి దీటుగా నీ తెలివితేటలున్నాయి సుమా!''

అమల సోఫాకి ఓ అంచున కూచుంది.

''మన మధ్య యింత దూరం సహించలేను డియర్...'' అంటూ చేయి పట్టుకోడానికి ప్రయత్నించాడు, నరసింహం.

అమల చేతిని వెనక్కి తీసుకుంది.

''ఎవరైనా చూస్తారండీ! మా ఆయన వచ్చినా వచ్చేస్తారు'' కంగారు నటిస్తూ అంది.

''ఏం భయం లేదు డియర్. మీ ఆయన వచ్చినా, యేమీ అనడు. మొన్ననామధ్య నా సమక్షంలో అతని ప్రవర్తన గమనించే వుంటావు. మీ ఆయనకి కావల్సింది ప్రమోషను.. కనకవర్షం కురిపించే మంచి 'సీటూను'' ముసిముసిగా నవ్వుతూ అన్నాడు, నరసింహం.


''అలాగా! అయితే, మా ఆయన కోరికలు మీకు తెలుసునన్న మాట!''

''తెలుసు. బాగా తెలుసు. ఈ విషయంలో నా ప్రాణాలు తోడేస్తున్నాడు.''

''అయితే, ఆయన కోర్కెల్ని యెప్పుడు తీరుస్తారు?''

''ఏముంది? వారం పది రోజుల్లో మంచి సీటుకి బదిలీ చేస్తున్నాను. అది, బంగారు గుడ్లు పెట్టే సీటు. అది అందరికీ దొరకదు. ప్రమోషను మరో నెల రోజులలో!''

''అంటే, మా ఆయన లాంటివారికే యిటువంటి అవకాశాలు దొరుకుతాయన్న మాట?''



"ఔను మరి! అందరికీ యిటువంటి ఛాన్సులు రావు కదా?"

"మరైతే, ఓ ప్రశ్న వేసేదా?"

"తప్పకుండా వెయ్యి. మనిద్దరమే యీగదిలో వున్నాం. మనలో మనకి అరమరికలేంటి? వెయ్యి ప్రశ్న.." ధీమాగా అన్నాడు.

"మీకు యీ ఆఫీసరుగిరీ వచ్చి యెన్నాళ్ళయ్యింది?"

"ఓస్. ఇదా ప్రశ్న? నాలుగేళ్ళు దాటింది.."

"అయితే, నాలుగేళ్ళ క్రితం మీ ఆవిణ్ణి మీ బాస్ దగ్గరికి పంపిస్తేనే వచ్చిందా యీ ప్రమోషను?" సూటిగ అతని మొహంలోకి చూస్తూ అంది.


నరసింహంకి షాక్ తగిలినట్టయ్యింది. అతనికి కళ్ళు తిరిగినయ్.. ఒక్కసారి. ఇటువంటి యెదురు దెబ్బ తగుల్తుందని అతనూహించలేదు.

"నాన్సెన్స్.. ఏవిటా ప్రశ్న? నేను నా తెలివితేటలు, కృషి ద్వారా పైకొచ్చాను..." కంగారుపడుతూ అన్నాడు.

అమల, అతనికేసి తీక్షణంగా చూసింది. "అది అబద్ధం! మీకు ఆ అలవాటుందనేగా, యిప్పుడీ అవకాశం కోసం అర్రులు చాస్తున్నారు?" కోపంగానే అంది.

నరసింహంకి, వొళ్ళు మండిపోయింది. అయితే, పరిస్థితి సున్నితమైనదని గ్రహించి, తమాయించుకున్నాడు. "చూడు అమలా, పిచ్చి పిచ్చి ప్రశ్నలు వెయ్యకు. మీ ఆయనకి పట్టబోయే అదృష్టానికి అడ్డు తగలకు. ఇటువంటి అవకాశం అందరికీ రాదు. నా కౌగిట్లోకి వచ్చేయ్.. మీ ఆయన్ని వరించబోయే అదృష్టాన్ని ఆహ్వానించు... మళ్ళీ రాదు యీ అవకాశం.. రా.." అంటూ ఆమెకి దగ్గరగా జరిగి, ఆమె చెయ్యి పట్టుకున్నాడు.

అంతే! అతని చెంప ఛెళ్ళుమంది. ఉగ్ర రూపం దాల్చిన అమల కాళికాదేవిలా కళ్ళెర్రచేసి, సర్రున లేచింది. "రాస్కెల్! మా ఆయనకి బుద్ధి లేకపోతే, యింత వయసొచ్చిన నీకు బుద్ధి లేకపోయిందా? నువ్వు మనిషివి కావూ? నీలో మానవత్వం లేదూ? నాలాంటి కూతుళ్ళు వుండాల్సిన నీకు, నేను కావల్సి వచ్చానా? భ్రష్టుడా? మళ్ళీ యెప్పుడైనా యిటువంటి పిచ్చి పిచ్చి వేషాలు వేశావంటే, నిన్ను సర్వనాశనం చేస్తాను... అండర్‌స్టాండ్... నీకు తెలుసా, మన సంభాషణంతా టేప్‌లో రికార్డయింది. నేను వూరికనే బెడ్‌రూమ్‌లోకి వెళ్ళలేదు..." అంది, ఉద్రేకంగా.




నరసింహంలోని కామోద్రేకం, సరసలాలస, ఒక్కసారి జీరో డిగ్రీకి దిగిపోయాయి. పిచ్చివాడిలా చూశాడు. "టేపు చేశావా?" మతిపోయినవాడిలా అడిగాడు.

"ఔను. నీలాంటి వాడికి, అదే తగిన శాస్తి. నీ వెధవ గుణాల్ని నలుగురికి చాటితేనే గాని నీ రోగం కుదర్దు..."

"అమ్మా అమలా.. తప్పయ్యింది. లెంపలేసుకుంటున్నాను. ఆ కేసెట్టు యిచ్చేయమ్మా! మరెప్పుడూ మీ యింటి ఛాయలకే రాను... నా మాట నమ్ము. బుద్ధొచ్చింది" కత్తివేటుకి నెత్తురు చుక్క లేదు.

నరసింహంని ఆ పరిస్థితిలో చూసి, ఓ పక్క నవ్వొస్తోంది, అమలకి. కాని, నవ్వలేదు. గంభీరతని మెయిన్‌టెయిన్ చేసింది.

"ఇప్పుడు తెలిసొస్తుందాండీ? కంగారు పడకండి.. కేసెట్టు యిచ్చేస్తాను. కాని, యిప్పుడు కాదు. మా ఆయనకి మంచి సీటులో వెయ్యండి... అతణ్ణి ప్రమోట్ చెయ్యండి. ఇది బ్లాక్‌మెయిల్ అనుకునేరు.. కానే కాదు.. మీ కిది తగిన శిక్ష. అవయ్యాక, కేసెట్టు తీసుకెళ్ళండి. మరో విషయం. ప్రతీకార చర్యగా మా వారికి యే విధంగానైనా అపకారం తలపెట్టారో, కేసెట్టుని పేపరు వాళ్ళకి అందజేస్తాను. అర్థమయ్యిందా? ఆడదంటే, యేంటనుకున్నారు? విలాస వస్తువనుకున్నారా? కానే కాదు.. కొండొకచో ఆదిశక్తిగా మారుతుందని గుర్తుంచుకోండి. వెళ్ళండిక...నలుగురూ చూడకముందే వెళ్ళండి. మరెప్పుడూ యీ యింటి ఛాయలకు రాకండి" గర్జిస్తూ అంది, అమల.

నరసింహం ఆపాద మస్తకం వణికిపోతూ, ముచ్చెమటలు పోశాయి. జేబులోంచి రుమాలు తీసుకుని, మొహం ఒత్తుకున్నాడు.

"అమ్మా అమలా! బుద్ధొచ్చిందమ్మా! వస్తాను... అబ్బే... వెళ్తాను.. మళ్ళీ రాను.." లెంపలు వాయించుకుని, బైటికి నడిచాడు, నరసింహం. వెనుదిరిగి చూడకుండానే స్కూటర్ స్టార్ట్ చేశాడు.

అమలకి నవ్వాగింది కాదు... నిండుగా నవ్వుకుంది. బెడ్‌రూంలోకి వెళ్ళి టేప్ రికార్డర్ ఆపేసి, కేసెట్టు తీసేసింది.

* * *

ఆ రోజు రాత్రి నరేంద్ర కడుపు నిండా చీవాట్లు తిన్నాడు. అయినా నోరెత్తలేకపోయాడు. అయితే, అమల సాధించిన విజయాన్ని హర్షించకుండా వుండలేకపోయాడు. ఆడది అనుకోవాలే కాని, సాధించలేనిదేం లేదనుకున్నాడు.

* * *

రెండు రోజుల్లో నరేంద్ర సీటు మారింది. నరేంద్ర ప్రమోషను కోసం రికమెండ్ చేశాడు, నరసింహం. ఆఫీసులోని స్టాఫంతా అచ్చెరువందారు... కారణం యెవ్వరికీ తెలీదు.

నరసింహం జీవితంలో యెంతో మార్పు వచ్చేసిందిప్పుడు.

ఇదంతా గుర్తుకొచ్చినప్పుడంతా అమల పగలబడి నవ్వుకుంటుంది.